అక్షయ ఫలితాలిచ్చే పర్వం

హైందవ ధర్మంలో ప్రతి పర్వానికీ ఓ ప్రత్యేకత ఉంది. కాలక్రమంలో కొన్ని పండుగల అంతరార్థం మారిపోయింది. అసలు కారణం మరుగునపడి.. కొసరు కారణం పైచేయి సాధిస్తున్నది. 'అక్షయ తృతీయ' విషయంలోనూ ఇదే కనిపిస్తుంది. వైశాఖ మాసం శుక్ల పక్షంలో వచ్చే తదియను 'అక్షయ తృతీయ' అంటారు. ఈ పండుగ స్థిరపడటం వెనుక పౌరాణిక, చారిత్రక కథనాలు ఎన్నో ఉన్నాయి. ఈ రోజు చేసే దానధర్మాలు, జపతపాలు అక్షయమైన ఫలితాలను ఇస్తాయని, దైవానుగ్రహం అక్షయంగా పొందే విశేషమైన పర్వమని పరమేశ్వరుడు.. పార్వతికి ఉపదేశించాడట. సుర గంగ అవనిపై అవతరించిన రోజు ఇదేనని చెబుతారు పెద్దలు. అక్షయ తృతీయకు సంబంధించిన పలు ఆసక్తికర కథనాలు ద్వాపర యుగంలో కనిపిస్తాయి. కుచేలుడు తన స్నేహితుడైన శ్రీకృష్ణుడిని కలుసుకొని, మూడు పిడికిళ్ల అటుకులు నివేదనగా సమర్పించి.. అంతులేని సంపదలు పొందిన తిథి ఇదేనని తెలుస్తున్నది. వనవాస సమయంలో ధర్మరాజుకు సూర్యభగవానుడు అక్షయ పాత్ర అనుగ్రహించింది కూడా ఇదే రోజని అందుకే దీనిని అక్షయ తృతీయ అంటారని కొందరి విశ్వాసం.

ఒక పేదరాలు తన జోలెలో వేసిన ఉసిరి కాయను స్వీకరించి, ఆమె స్థితిగతులనూ, ఇచ్చే గుణాన్ని గుర్తించి ఆదిశంకరులు అమ్మవారిని ప్రార్థించి ఆ పేదరాలి ఇంట బంగారు ఉసిరికాయల వాన కురిపించింది కూడా ఈ వైశాఖ శుద్ధ తదియనాడే అని చెబుతారు. ఆత్మానుసంధానంతో ఐశ్వర్యలక్ష్మిని ఆవాహనం చేసి ఆదిశంకరులు 'కనకధారా స్తోత్రా'న్ని జాతికి అనుగ్రహించిన ఈ పర్వదినం ఎంతో విశిష్టమైనది. ఈనాడు చేసే ఏ చిన్న సత్కార్యమైనా అనంత ఫలాన్నిస్తుందని పెద్దల మాట. అక్షయ తృతీయ నాడు బంగారం కొనాలనీ, అలా కొనుగోలు చేస్తే బంగారం అక్షయం అవుతుందనీ ప్రస్తుతం లోకంలో ప్రచారంలో ఉన్న విశ్వాసానికి ప్రమాణం కనిపించదు. ఈ పండుగ పూట పుణ్యకార్యాలు ఆచరించాలనీ, శక్తిమేరకు దానధర్మాలు చేయాలని మాత్రమే శాస్త్రం నిర్దేశించింది. అయితే దానాలలో సువర్ణ దానం ప్రత్యేకమైనది. అందుకోసం బంగారం దానం చేయాలని సూచించారు. అంతేకానీ, కొనుగోలు చేసి బోషాణంలో దాచుకోవాలని కాదు! చివరిగా, అక్షయ తృతీయ రోజు చేసే సత్కార్యం ఎంతటి విశేష శుభ ఫలితాన్ని ఇస్తుందో.. చెడు కార్యం తలపెడితే అంతటి అశుభ ఫలితాలు కలుగుతాయి. కాబట్టి.. ఈ పర్వదినం సందర్భంగా జపం, దానం చేసి ధన్యత పొందుదాం.



... శ్రీ

భగవత్ తత్త్వజ్ఞానానికి ఆలవాలమైన - నెలవైన 'ఉలూఖల బంధన'లీలా కథనంలో భక్తకవి కుల తిలకుడైన పోతన బాలకృష్ణుని 'భక్తి వశ్యత' (భక్తులకు లోబడుట)ను మూల శ్లోకాలను మరిపించే చందాన అనేక కందాలలో, ఆటవెలదులలో చాలా తేటగా, అందంగా రూపొందించి సహృదయ పాఠకుల డెందాలను మురిపించాడు.

ఉలూఖల బంధన లీల

శుక ఉవాచ– పరీక్షిన్మహారాజా! ఎంగిలి పడక, ఏమరుపాటు లేక మనసు తొంగిలించగా (పరవశించగా) శుభాంగుడైన రథాంగపాణి (విష్ణుని) మంగళకరములైన కథలు అవిశ్రాంతంగా వింటున్న నీకు అనేక మంగళాశాసనాలు. అబ్బ! ఎంత ఆశ్చర్యం! రమాకాంతుడు బలరామానుజుడు బాలకృష్ణుడు వామనుని వలె తన రూపాన్ని ఇసుమంత కూడా కుచించలేదు. త్రివిక్రముని వలె అంతగా పెంచనూలేదు. పలుపులు (పశువుల తాళ్లు) అన్నీ కలిపి కడుతున్నా చిన్మయ బాలుడు, చిలిపి కృష్ణుడు అడ్డుపడలేదు. వెన్నుని (కన్నయ్య) నడుము– మొల ఏమన్నా పెరిగిందా? అంటే లేదు. తాళ్ల పొడవులు తగ్గినయ్యా? అంటే అదీ లేదు. తాళ్లు విడివిడిగా కట్టినా రెండంగుళాలు తక్కువ. కలివిడి (కలగలసి)గా కట్టినా రెండంగుళాలే తక్కువ. నిర్గుణుని గుణం– తాడు చుట్టడం, కట్టడం మాట దేవుడెరుగు, కనీసం ముట్టలేకపోయింది. తడబడుతున్న యశోదకు కడకు ఏమి చెయ్యాలో తోచలేదు. ఆమెకు ఒళ్లంతా చెమటలు కారిపోయాయి. పైటకొంగు జారిపోయింది. కొప్పు సడలి పూలు రాలిపోయాయి. ఇరుగుపొరుగు గోపికలు పరుగు పరుగున వచ్చి చూసి వెరగుపడి ఇలా అన్నారు– అమ్మా! యశోదమ్మా! నీ వలన నీ కొమరునికి బంధనం లేదని ఆనందపడవచ్చు గదా! ఎందుకు నొచ్చుకుంటావు? బ్రహ్మదేవుడు వీని నొసటన బంధనం రాసినట్లు లేదు. పిచ్చి తల్లీ! పిల్లవాని మీద ఎందుకింత కచ్చ?



విష్ణువంటే సర్వవ్యాపకుడని కదా అర్థం. వ్యాపకు(వ్యాపించు విష్ణు)నిచే వ్యాప్యం (వ్యాపించబడు విశ్వం) కట్టబడుతుంది కాని, వ్యాప్యం వ్యాపకుని ఎప్పుడూ కట్టలేదు. అంతాతానే అయిన అచ్యుతునికి అన్యం లేనప్పుడు ఆయనను ఏది బంధిస్తుంది? కనుక, పరమార్థంలో త్రిగుణాత్మకము, జడమూ అయిన మాయా రజ్జువు త్రిగుణాతీతము, మాయా రహితమూ అయిన చైతన్యాన్ని బంధింపజాలదు. బంధించ గలిగేది ప్రేమ రజ్జువు మాత్రమే! అది కూడా ఆయనకు ఇష్టమైతేనే! 'లోకాధ్యక్షుడు, శోక నాశనుడు సాకారుడుగా సాక్షాత్కరించినా శాస్త్ర సిద్ధాంత రీత్యా అక్షరాలా నిరాకారుడే' అని పరమార్థం! శుకయోగి...

కం॥ 'జ్ఞానులచే మౌనులచే
దానులచే యోగ సంవిధానుల చేతం
బూని నిబద్ధుండగునే
శ్రీనాథుడు భక్తి యుతుల చేతం బోలెన్?'

'రాజా! భక్తులకు పట్టుబడినట్లుగా భగవంతుడు శ్రీహరి జ్ఞానులకు గానీ, మౌనులకు గానీ, దానపరులకు గానీ, యోగ సంవిధాన వరులకు– యోగీశ్వరులకు గానీ పట్టుబడడు గదా!'

ఇంతవరకు ముఖ్యమైన రెండు మాటలు.. నందగోపకాంత యశోద ఇంకా అంతగా అలసిపోలేదు, కట్టాలన్న పట్టుదల వదలనూ లేదు. రెండవది– బాలకృష్ణునికి తల్లిమీద చాలినంత జాలి– కృప కలుగలేదు. భక్తుడు పెనుగులాడినంత వరకు భగవంతుడు దయచూపడు. భక్తుని (భక్తురాలి) పరిశ్రమ ప్రయత్నం పరాకాష్ఠకు చేరి పరిపూర్ణం కావాలి. అనువుగా భగవదనుగ్రహం వెల్లివిరియాలి– పైకి విరజిమ్మాలి! అప్పుడే రెండుంగుళాల లోటు తీరేది. నందసకి యశోద కిట్టప్పను ఇంకా కట్టలేకపోవడం లోని గుట్టును ఇలా విప్పాడు వైయాసకి– శుక యోగి. జ్ఞానవైరాగ్యాలు లేని కేవల భక్తి– వాత్సల్యం కల యశోదకు తాడు రెండంగుళాలు తగ్గింది.. కృష్ణుని కట్టనగునా అన్న జ్ఞానం లేదు. నేలపాలైపోయిన పాలు, పెరుగుల పట్ల 'పోతే పోయాయిలే, భాగ్యమా? బంగారమా?' అను వైరాగ్యం లేదు. నిజానికి నంద జాయ (పత్ని) మనసులో 'నేను వీణ్ని అనాయాసంగా, ఖాయంగా కట్టగలను' అన్న అహంకారముంది. అదే అంతరాయం– విఘ్నం. ఈ అహంకారం వల్ల ఒక అంగుళం దూరం ఏర్పడింది. నందరాణి ఒక అంగుళం దూరం– ఎడమైతే, యదునందనుడు కూడా బదులుగా ఒక అంగుళం పెడమొహమయ్యాడు. ఇదీకాక, బాలకృష్ణుని స్పర్శ తగులగానే తాళ్లకు సహజంగా ఉండే తెగులు– బంధించే స్వభావం తొలగిపోయేది! బ్రహ్మ సంబంధం కలిగితే ఏ బంధమూ ఉండజాలదు– 'యస్యస్మరణ మాత్రేణ జన్మ సంసార బంధనాత్ విముచ్యతే' అని కదా విష్ణు సహస్రనామ స్తోత్రం.

శ్రీహరి సూరి 'భక్తి రసాయనం'లో రెండంగుళాల తగ్గుదలపై మెండుగా చాలా ప్రౌఢమైన– గడుసైన వ్యాఖ్యానం చేశాడు. యశోద తెచ్చిన గుణాలు– తాళ్లు అన్నీ కలిసి కూడా భగవంతుని 'అసంగత్వం, నిత్య ముక్తత్వం'– ఈ రెండు దివ్య అప్రాకృత గుణాలకు సమాధానం చెప్పలేకపోయాయి. ఇంద్రియాలకే బంధనం. ఇంద్రియ అధిపతులకు లేదు. గోవిందుడు గో (ఇంద్రియ)పతి– హృషీకేశుడు (సమస్త ఇంద్రియాధిపతి). గోబంధకాలు– గోవులను బంధించే తాళ్లు గోపతిని ఎలా బంధించగలవు? వేదాంత శాస్త్రాను సారం అధ్యస్తము (ఆరోపితము)నకే బంధనం. కాని, అధిష్ఠానానికి బంధనం ఉండదు. బాలకృష్ణుని– దామోదరుని ఉదరం అనంతకోటి బ్రహ్మాండాలకు అధిష్ఠానం– ఆధారం. సృష్టి, స్థితి, లయలకే ఇంధనం. దానికి బంధనమేమిటి? శుద్ధ సత్త్వగుణ సంపన్నులు తప్ప రజస్తమో గుణ సంపర్కం కలిగిన అన్యులు ఎంత మాన్యులైనా మాధవుని ముట్టలేరు, కట్టలేరు. నామరూపాలు కలిగి ఉండేదే బంధానికి లోనవుతుంది. శ్యామ బ్రహ్మ– శ్రీకృష్ణపరమాత్మ నామరూప రహితుడు, నిత్యముక్తుడు. దామబంధన లీలలో రెండంగుళాల న్యూనత– కొరత ఈ సత్యాన్నే సూచిస్తోంది! శుకుడు– రాజా! 'కట్టరాని తన్ను గట్టెదనని చింత గట్టుకొనిన తల్లి గరుణ జూచి'.. కట్టడానికి వల్లకాని తనను కట్టివేయాలనే పట్టుదల, ప్రల్లదనం (బిగువు, బింకం)తో ఇక్కట్లు పడుతున్న తల్లిని చూచి నల్లనయ్య జాలిపడ్డాడు.



కం॥ 'బంధ విమోచను డీశుడు
బంధింప బెనంగు జనని పాటోర్చి సుహృ
ద్బంధుడు గావున జననీ
బంధంబున గట్టు వడియె బాటించి నృపా!'

ముకుందుడు భవ బంధాలను తొలగించి ముక్తిని ప్రసాదించేవాడు. ఆర్తులైన శరణాగతులకు, ఆప్తులైన వారికి ఆత్మబంధువు. ఆ వనజాక్షుడు– నంద తనయుడు తన జనని పాట్లు కనలేక కనికరించి తనకుతానే బంధనం స్వీకరించాడు. ఆ బాలగోపాలుడు భక్త పరాధీనుడు కాన అంబచే రోలను– రోటికి కట్టుబడిపోయి ఉన్నాడు. ఏలాగున ఉన్నాడు? బిక్క (తెల్ల) మొహం వెయ్యక, ఆలానానికి– కట్టు కంబానికి కట్టబడి ఉన్న మదపుటేనుగు గున్నవలె నల్లనయ్య చాలా చక్కగ ఉల్లసిల్లు (ఒప్పు)తున్నాడు. లోకాలన్నిటికి మొదలు, మధ్య, చివర అయిన నరరూప పరమాత్ముని కట్టాలంటే శరణాగతి చేసిన పరమ అంతరంగ భక్తురాలు కనుక యశోదమ్మకు సాధ్యమైనది కాని, ఇతర ముద్దుగుమ్మలకు– అతివలకు సుతరాం– ఎంతమాత్రం సాధ్యం కాదు కదా!

కం॥ 'చిక్కడు సిరి కౌగిటిలో
చిక్కడు సనకాది యోగి చిత్తాబ్జములం
జిక్కడు శ్రుతిలతికావళి
జిక్కెన్ నతడు లీల దల్లి చేతన్ రోలన్'–

ఆ మేటి లీలా కిటి (వరాహ) రూపధారి పాల మున్నీటి రాకన్య (శ్రీదేవి) కౌగిటిలో చిక్కలేదు. ఆ ఇందీవరాక్షుడు– ఇందిరాపతి సనక సనందనాది అలనాటి మహాయోగుల హృదయారవిందాలలోనూ బందీ కాలేదు. శ్రుతు (వేదా)లనెడు లతల (తీగల) వితతుల (సమూహాల)లోనూ చిక్కుకొన్న వాడు కాదు. అట్టి సాటిలేని బాలుడు, అక్కజం– ఆశ్చర్యంగా తల్లి చేతికి చిక్కి రోటికి కట్టుబడ్డాడు!

కం॥'సంగడి దిరిగెడు శంభుడు
నంగాశ్రయయైన సిరియు నాత్మజుడై యు
ప్పొంగెడి పద్మజుడును గో
పాంగన క్రియ గరుణ వడయ రభిలేశ్వరుచేన్'

మహారాజా! చతుర్ముఖ బ్రహ్మ విష్ణు స్వామికి పుత్రుడు, శిష్యుడు, భక్తుడు. ప్రవృత్తి మార్గ ప్రవర్తకుడు. సర్వజీవపితామహుడు. ఇక మహాదేవుడు పౌత్రుడు, నివృత్తిమార్గ నిరతుడు, ప్రవర్తకుడు. ప్రళయ కారణుడు, గుణావతారం. సర్వ సంగ పరిత్యాగం చేసి ఖగరాజ తురంగుడు– శ్రీహరి సేవకై పరితపించు యోగీశ్వరుడు. పోతే, వీరిద్దరి కంటే పరమాంతరంగిక భక్తురాలు 'తామర లందుండెడి ముద్దరాలు'– అరవింద మందిర (ఇందిర) శ్రీమహాలక్ష్మి. అర్ధాంగి, బ్రహ్మానంద స్వరూపురాలు, జగజ్జనని. వక్షఃస్థల నివాసిని అయినా విష్ణు చరణ సేవా రతి కలిగిన సతీమతల్లి, అతిపూజ్యురాలు. కాని, నందగేహిని యందు ఈ విశేష గుణాలు ఏవీలేవు. అయినా ఆమెకు అనిర్వచనీయ, అవ్యాజ అనుగ్రహ ప్రాప్తి!– నిత్యముక్తుడు, ముక్తిదాత బద్ధుడయ్యాడు! (సశేషం)

తంగిరాల
రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

శంకరం లోక వశంకరం

సనాతన ధర్మానికి చెదలు పట్టినప్పుడల్లా పురుగు మందు చల్లి సంస్కరించిన మహనీయులు ఎందరో! అలాంటివారిలో జగద్గురువు ఆదిశంకరాచార్యులు ముఖ్యుడు. కాలడిలో జన్మించి కాలినడకన దేశమంతా రెండు పర్యాయాలు సంచరించి వైదిక ధర్మాన్ని నిలబెట్టిన మహనీయుడు ఆయన. ముక్కుపచ్చలారని బాల బ్రహ్మచారి ముఖంలో బ్రహ్మతేజస్సు స్పష్టంగా కనిపించేది. ఆయన పిలిస్తే దేవతలు పలికేవారు అనడానికి ఉదాహరణలు కోకొల్లలు. ఒక పేద ఇల్లాలిని అనుగ్రహించడానికి కనకధార స్తవంతో అమ్మవారిని అర్చించి.. పూరి గుడిసె వాకిట బంగారు ఉసిరికాయల వర్షం కురిపించిన ఉదంతం అద్భుతం. ఎవరైతే ఈ స్తోత్రాన్ని భక్తిశ్రద్ధలతో త్రికాలాలలో పారాయణం చేస్తారో వారు కుబేరునితో సమానమైన సంపదలను పొందుతారని లక్ష్మీకటాక్షం అనుగ్రహించాడు. అప్పటికి జగద్గురువు బాల శంకరుడే! జీవిత కాలం అధ్యయనం చేసినా అంతు బట్టని వేద వాఙ్మయాన్ని అనతికాలంలోనే ఆపోశన పట్టి.. బ్రహ్మసూత్రాలకు భాష్యం రాసిన సరస్వతీ పుత్రుడు శంకరులు. మంచినీళ్ల కోసం నదిదాకా వెళ్లలేకపోతున్న తల్లి ఆర్యాంబను చూసి బాల శంకరుడి మనసు తల్లడిల్లింది. పూర్ణా నది గమనాన్ని మార్చి అమ్మ పడుతున్న కష్టాన్ని దూదిపింజలా తేల్చేశాడు. సన్యాసాశ్రమ స్వీకారానికి, తల్లి అనుమతి కోసం మకరం పట్టుకుందని నమ్మబలికాడు. మతిమాలిన ధర్మాలు పట్టి పీడిస్తున్న ఆర్ష సంస్కృతిని ఉద్ధరించడానికి పాలుగారే పసివయసులోనే సన్యసించాడు. అదే సమయంలో తల్లి తలుచుకోగానే వస్తానని చెప్పి దేశాటనకు బయల్దేరాడు. ఇచ్చిన మాట ప్రకారం అవసాన దశలో ఉన్న తల్లి తలుచుకోగానే వచ్చాడు. చివరి ఘడియల్లో ఉన్న అమ్మకు హరిహరుల దర్శనం గావించి అద్వైత భావాన్ని అనుభవింపజేశాడు. కన్నుమూసిన తల్లికి అంతిమ సంస్కారం నిర్వహించాడు. కర్మభూమి భారతావనిలో జ్ఞానామృతాన్ని పంచడానికి తన జీవితాన్ని ధారపోశాడు. అనైక్యతతో,



ఈ నెల 12న శంకర జయంతి

భిన్న భిన్న దేవతారాధనలతో, పిడివాదాలతో, పాషండ మతాలతో అతలాకుతలమై వేదధర్మం క్లిష్టస్థితిలో ఉన్న సమయంలో హైందవ జాతికి సక్రమ దిశానిర్దేశం చేసే ఒక దీపస్తంభంలా అసామాన్య సంస్కార వారసత్వాన్ని ప్రసాదించాడు. తన బోధనలు, వాదనల ద్వారా హైందవ తత్వాన్ని జగజ్జేగీయమానం చేశాడు. ఆధ్యాత్మిక విజ్ఞాన పునఃస్థాపన కోసం దేశమంతా సంచరించి, పంచాయతన పూజా విధానాన్ని ఏర్పాటుచేశాడు. షణ్మత స్థాపనాచార్యుడిగా, అద్వైత సిద్ధాంత ప్రతిష్ఠాపనాచార్యులై జగద్గురువుగా నిలిచాడు.

... ఫణీంద్రకుమార్

శాంతి-ఆనందం

శాంతానికి ఫలం ఆనందం. ఆనందానికి మూలం శాంతం. ఈ రెండూ మానవుడి దివ్య హృదయ స్పందనలు. నిజానికి ఇవి అభేద అమృతనదులు. అశాంతి అంటే అలజడి, అనిశ్చితి, భయం, అసంతృప్తి, బాధ. మారే ఉద్ధృతులతో లోలోపల సాగే ప్రవాహాలే శాంతి, అశాంతి. ఖండాలుగా ఆయా సందర్భాలలో కలిగే అనుభవాలే సుఖాలు, బాధలు. అశాంతిని కలిగించేవే అనేక రూపాలలో వచ్చే సమస్యలు. మన జ్ఞాన, ఇచ్ఛా, క్రియాశక్తులను వాటి పరిష్కారం వైపు కేంద్రీకరింపజేసే సందర్భాలు.

సమస్యలు కొన్ని స్వయంకృతాలు. కొన్ని అన్యకృతాలు. తన దేహ, బుద్ధి పరిమితుల వల్ల కలిగేవి, ముందుజాగ్రత్తతో నివారించుకోగలిగినవి స్వయంకృతాలు. తన అధీనంలో లేని ప్రాకృతిక, సామాజిక, రాజ్యశక్తులతో కలిగే సమస్యలు అన్యకృతాలు. అన్యకృత సమస్యలను ఎప్పటికప్పుడు ఎదుర్కొని పరిష్కరించుకోవాల్సిందే! లేదా వాటి ప్రభావం నుంచి దూరంగా ఉండటానికి, చాలా స్వల్పంగా గురయ్యేలా జీవించడానికి పూనుకోవాల్సిందే! అయితే విస్తరిస్తున్న నవ్యనాగరికత వల్ల రెండవ వికల్పానికి అవకాశాలు సుమారుగా లుప్తమైనట్లే. ఏ సమస్యలకైనా పరిష్కారాలు పొందవలసింది... గురువు, పెద్దలు, సంప్రదాయం, శాస్త్రం, స్వీయ అనుభవాల ద్వారానే! బుద్ధికి అందిన మార్గాలలోనే!!

ఆయా సమాజాల పరిణత సంస్కృతులు నిర్దేశించిన మార్గంలో, విచక్షణాయుతంగా... సమకాలీన సాంకేతిక సహకార వినియోగంతో జీవితాన్ని సాగిస్తే సగం సమస్యలకు అవకాశమే ఉండదు. మిగతా సమస్యల్లోనూ చాలావరకు ఇంద్రియ నిగ్రహంతో, కొంత ముందుచూపుతో, క్షమతో జీవిస్తే సులభంగా పరిష్కారం అవుతాయి. పరిష్కరించలేని సమస్యలను భగవంతుడిపై భారంవేసి, జాగరూకతతో భరిస్తూ కాలానికి వదలి వేయడమే వివేకం.

ఏ సమస్యలు ఉన్నా, ఎలాంటి సమస్యలూ లేకున్నా... ఎటువంటి విశిష్టతలు ఉన్నా లేకున్నా.. ధర్మనిష్ఠతో, వృత్తి నిబద్ధతతో, కృతజ్ఞతతో, దైవచింతనతో రుషులు సాధన చేసిన ఆర్షమార్గంలో సాగించే జీవితం శ్రేయస్కరం, ఆనందమయం, భవ్య భవిష్యత్తు పోషకంగా పరిఢవిల్లుతుంది. వారివారి ప్రజ్ఞ, కృషి, కుటుంబ నేపథ్యం, సమాజంలోఉన్న పరపతి వల్ల కలిగే కౌశలాలు, స్థానాలు, సంపదలు, అధికారాలు, కీర్తిప్రతిష్ఠలు తాత్కాలికమే! అయితే, ఆర్షమార్గంలో ధర్మబద్ధంగా సాగితే ఈ విశిష్టతలు ఆయా వ్యక్తులకే కాక వ్యవస్థకూ మహామధుకోశంగా మారుతాయి. అలా కాకుండా మాయలోపడి అహంకార మద దష్టమైతే శాంతి లోపిస్తుంది. అశాంతి ప్రబలుతుంది. సమస్యలు వెంటాడుతాయి. మన విధానశైలి ఎంతటి పటాటోపంతో, ప్రశంసలతో సాగినా , 'చరిత్ర'లో ఎంతగొప్పగా పేరు గడించినా... సంస్కార తరంగాలుగా ప్రకృతిరుతంలో లీనమయ్యే వారి మూల్యాలు .. అంటే భగవంతుడి నిర్మితిన వారి కర్మలు భావిభవ్యతకు కుపోషకాలే. సత్యగత, నిష్కుటిల, సమార్ధ విధానాలే సమస్యలను ఛేదించే భవ్యనిర్మాణ పథాలు అని గుర్తెరగాలి.

... యముగంటి ప్రభాకర్
94401 52258

ఉపనిషత్ వాక్యం

యోగులు కరుణామయులు

స్వాత్మవత్ సర్వభూతేషు కాయేన మనసా గిరా,
అనుజ్ఞా యా దయా సైవ ప్రోక్తా వేదాన్తవేదిభిః॥
(దర్శనోపనిషత్తు 1-15)

శరీరంతో, మాటతో, మనసుతో సకల జీవుల్లోనూ తనపై గల ప్రేమను చూపించడాన్ని 'దయ' అని వేదాంతులు చెబుతారు. 'నితాంతాపార భూతదయయును.. తాపస మందార! నాకు దయసేయగదే!..' అని ప్రార్థించాలని భాగవతం సూచిస్తున్నది. అంటే ఇతరులపై అంతులేని భూతదయ మనిషికి ఉండటం ముఖ్యమని తెలుస్తున్నది. ఆధ్యాత్మిక సాధకులకైతే ఇక చెప్పాల్సిన పని లేదు. మనం భగవంతుడిని కోరుకునేదల్లా మన మీద దయ చూపించమనే కదా! మనకు తోటి ప్రాణులపై దయ ఉంటే.. తోటి ప్రాణులకే గాక భగవంతునికీ మన మీద దయ కలుగుతుంది. ఎవరికి మెత్తటి హృదయం ఉంటుందో వారికే దయ ఉంటుంది. ఎదుటివారి కష్టాలు వారు మాత్రమే చూడలేకపోతారు. చూడలేక ఒక్కొక్కసారి విలపిస్తారు కూడా. శక్తివంచన లేకుండా సాయం చేస్తారు.



ఒకానొకప్పుడు కాశీ ప్రాంతం 'ఘాజీపురం' గ్రామ సమీపంలోని గంగా తీరంలో పవహారిబాబా అనే యోగి సొరంగం నిర్మించుకొని అందులో తపస్సు చేసుకుంటూ ఉండేవాడు. పవహారి అంటే గాలిని భుజించేవాడు అని అర్థం. ఆ సొరంగం పైన ఒక ఆశ్రమం కూడా నిర్మించి భక్తులకు దర్శనమిచ్చేవాడు. ఒకసారి ఒక దొంగ ఆశ్రమంలో జొరబడి వస్తువులన్నీ మూట గట్టుకున్నాడు. ఇంతలో ఏదో అలికిడి కాగా.. మూటను పడవేసి దొంగ పారిపోయాడు. బాబా ఇది గమనించి దొంగ దరిద్రావస్థకు మిక్కిలి చింతించినాడు. 'అయ్యో పాపం' అని ఎంతో జాలితో మూట చేత బుచ్చుకొని దొంగవెంట పరుగెత్తి కలుసుకున్నాడు. మూటను దొంగ పాదాల వద్ద ఉంచి కన్నీళ్లు పెట్టుకున్నాడు. 'మన్నించు నాయనా! ఈ వస్తువులు నీవే! నావి కావు. తీసుకుపో' అని బతిమాలాడట. ఆ మాటలకు దొంగ విస్తుపోయాడు. తన కర్కశత్వాన్ని వదిలిపెట్టి యోగి శిష్యుడిగా మారిపోయాడు. దర్శనోపనిషత్తు వాక్యానికి పవహారి బాబా నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తాడు!

... డా॥ వెలుదండ సత్యనారాయణ

జీవితం-మరణం

ఈ సృష్టిలో ప్రతీ ఒక్కరూ మరణ ద్వారం దగ్గర నిలబడి ఉన్నారన్నది కాదనలేని చేదు నిజం. మనిషికి తానెప్పుడు చనిపోతానో తెలియనప్పుడు ప్రతీ ఘడియనూ మరణ సమయంగానే భావించాలి. మనిషి వేసే ప్రతీ అడుగూ మరణానికి దగ్గర చేసేదే! నేడు జీవితం, రేపు మరణం అన్న భావనతోనే జీవన ప్రయాణాన్ని కొనసాగించాలి. తెలిసిన ప్రపంచం నుంచి తెలియని లోకానికి ప్రయాణమే మరణం. కానీ, మనిషి దీన్ని గుర్తించడు. మరణమనే మాటనే జీర్ణించుకోలేడు. ఇప్పట్లో చావు తన దరికి రాదనుకుంటాడు. ఈ భావనే అతణ్ని మోసానికి గురిచేస్తుంటుంది. కానీ, నిత్యం మరణాన్ని గుర్తుంచుకున్న వారే వివేకవంతులు. 'చివరకు ప్రతి మనిషీ మరణిస్తాడు. మీరంతా మీ పూర్తి ప్రతిఫలాన్ని ప్రళయంనాడు పొందుతారు' (దివ్య ఖురాన్ 3:185) అని అల్లాహ్ అప్రమత్తం చేశాడు. ఎవరికైనా మరణ సమయం ఆసన్నమైనప్పుడు వ్యవధి ఉండదని ఖురాన్ హెచ్చరిస్తుంది. 'మీలో ఎవరికైనా మరణ సమయం సమీపించినప్పుడు.. ఆ వ్యక్తి 'ఓ నా ప్రభూ! నీవు నాకు మరికొంత వ్యవధి ఎందుకివ్వలేదు. నేను దానధర్మాలు చేసి సజ్జనులలో కలిసిపోయేవాణ్ని కదా?' అని వాపోయే పరిస్థితి రాకముందే మీకు ఇచ్చిన ఉపాధి నుంచి ఖర్చుపెట్టండి. ఎవరి ఆచరణ వ్యవధి అయినా ముగిసిపోయే సమయం ఆసన్నమైనప్పుడు, అల్లాహ్ ఇక అతనికి ఎంతమాత్రం అదనపు వ్యవధి ఇవ్వడు' (ఖురాన్ 63:10-11). 'ఆయన అందరికీ ఒక నిర్ణీత కాలం వరకు గడువు ఇస్తాడు. అంత్యకాలం సమీపించినప్పుడు, ఒక్క ఘడియ కూడా వెనుకా ముందూ కాజాలదు' (ఖురాన్ 16:61) అని పవిత్ర గ్రంథం హెచ్చరిక. పదిమందికీ సాయం చేసిన మనిషికి స్వర్గంలోకి ప్రవేశం లభిస్తుంది. ఇది ఖురాన్‌లో అల్లాహ్ ఉద్బోధ.



ఇస్లాం జ్యోతి

... ముహమ్మద్ ముజాహిద్
96406 22076